
క్లుప్తంగా

డబుల్ రోడ్డు పనులు చేపట్టండి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో డబుల్ బీటీ రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేయాలని సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఆస సురేశ్, వార్డు మాజీ సభ్యుడు జగ్గ బాల్‌రాజు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం





భిక్కనూరు:మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఏనుగు భాస్కర్‌రెడ్డి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. కామారెడ్డి పట్టణంలోని వివేకానంద పాఠశాల 1990–91 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ.51 వేలను తమ బ్యాచ్ తరఫున సేకరించి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, ప్రతినిధి బాపురెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన




సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, కార్యదర్శి కమలాకర్ రావు, ట్రెజరర్ శ్రీనివాస్, జిల్లా బాధ్యులు గాదారి గంగారెడ్డి, సుతారి గంగారాం,అంకం సంఘమేశ్వర్, చిట్టెపు రాములు, వైట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా లక్ష్మణచారి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల ఉపాధ్యక్షుడిగా ఎర్రాపహాడ్‌కు చెందిన లక్ష్మణచారిని ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. లక్ష్మణచారి పార్టీలో చురుకుగా పనిచేయడంతో ఆయన పనితనం గుర్తించి ఎమ్మెల్యే మదన్‌మోహన్ లక్ష్మణచారిని ఉపాధ్యక్షుడిగా ప్రకటించారన్నారు. అలాగే క్రిష్ణాజివాడికి చెందిన మత్తయి బాలయ్యను బీసీసెల్ మండల అధ్యక్షుడిగా ఎనుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లక్ష్మణచారి,బాలయ్యలు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆహ్వానం




ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును టీఎన్‌జీవో సంఘం నాయకులు ఆదివారం కలిశారు. ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. టీఎన్‌జీవో సంఘం కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని ఈ సందర్భంగా వారు ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు మహిపాల్, సభ్యులు శరణ్, రవీందర్, అరుణ్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామానికి చెందిన తనుగొండ చంద్రానికి ఎస్సై అనిల్ ఆదివారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. చంద్రం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

కానిస్టేబుల్ టు టీచర్



మాచారెడ్డి: ఇటీవల విడుదలైన డీఎస్సీలో మాచారెడ్డి ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సౌజన్య ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఆమెను ఆదివారం ఎస్సై అనిల్‌తో పాటు పోలీస్ సిబ్బంది శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.

‘108’కు వసతులు కరువు

- ఎండకు ఎండుతున్న వాహనాలు
- నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న సిబ్బంది


ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఆవరణలో చెట్టు కింద నిలిపిన 108 వాహనం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అన్నివేళల్లో ఆపదలో ఉన్న వారిని ఆదుకునే 108 వాహనం అంబులెన్సులకు నిలువ నీడ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంబులెన్సు సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. 24 గంటల పాటు సేవలందించే అంబులెన్సులకు నీడ లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి ఎండకు ఎండుతు, వానకు తడుస్తున్నాయి. 108 వాహనాలతో పాటు సిబ్బందికి నీడను కల్పించేలా వసతులు సమకూర్చాలని సిబ్బంది కోరుతున్నారు.

జిల్లాలో 15 అంబులెన్సులు...

జిల్లాలో 108కి సంబంధించిన 15 అంబులెన్సులు ఉన్నాయి. వీటిలో పనిచేసే సిబ్బంది 60 మంది ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం పాత మండలాలలైన కామారెడ్డి, ఎల్లారెడ్డి, భిక్కనూర్, బాన్సువాడ, లింగంపేట, గాంధారి, జుక్కల్, సదాశివనగర్, బీర్కూర్, పిట్లం, బిచ్కుంద, దోమకొండ, మాచారెడ్డి పరిధిలో 108 వాహనాలు ఉన్నాయి.

చెట్ల కిందనే వాహనాలు..

ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఆవరణలోని చెట్ల కింద అంబులెన్సు వాహనాలను నిలిపి శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్‌లో సిబ్బంది సేద తీరుతున్నారు. లింగంపేట మండలంలో 108ను తహసీల్ కార్యాలయంలో నిలుపుతున్నారు. గాంధారి, సదాశివనగర్, బాన్సువాడలో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో, భిక్కనూర్‌లో పీహెచ్‌సీ ఆవరణలో వాహనాలను నిలుపుతున్నారు. వాహనాలకు షెడ్లు లేక సిబ్బందికి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాలలో వాహనాలు నిలపడంతో పాటు వారి పరిసరాలలోని క్వార్టర్స్‌లో ఉంటున్నారు. వారు వాహనాలను ఇక్కడ నిలపవద్దని ఎక్కడైనా చూసుకోవాలని చెబితే మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాహనాలకు షెడ్లు, సిబ్బందికి ఉండేందుకు వసతి కల్పించాలని 108 సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

108 వాహనాలకు సంబంధించి షెడ్లు లేని కారణంగా పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఆవరణలో ఉంచుతున్నాం. ప్రభుత్వం 108 వాహనాలకు షెడ్లతో పాటు సిబ్బందికి వసతి గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– తిరుపతి, 108 కామారెడ్డి జిల్లా మేనేజర్

తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్:తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం ఆదివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో కామారెడ్డి రక్తదాతల సమూహం, ఐవీఎఫ్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 78 మంది రక్తదానం చేశారు.రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం జిల్లాలో ఇప్పటికి 4 వేల యూనిట్ల రక్తం సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశామన్నారు.ప్రతి 20 రోజులకు ఒకసారి తలసేమియా వ్యాధి చిన్నారులకు రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, యువత రక్తదానం కోసం ముందుకు రావాలని పిలుపు ని చ్చారు. దాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్ , పి.అనిల్ పాల్గొన్నారు.

ధర్మారావ్‌పేట్ యువకులు ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌కు చెందిన యువకులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.తలసేమియాతో బాధపడుతున్న చి న్నారుల కోసం యువకులు రక్తదానం చేశారు. ఉత్తమ రక్తదాతగా సంతోష్‌రెడ్డి నిలిచారు. వారిని గ్రామస్తులు అభినందించా రు. భానుప్రసాద్, సంజీవరెడ్డి, మహేందర్, రంజిత్‌రెడ్డి, శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం నేతలు

కామారెడ్డి టౌన్: ఇటీవల డీఎస్సీ–2024లో ఉద్యోగాలు సాధించిన మున్నూరు కాపు ఉపాధ్యాయులను ఆదివారం జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఉద్యోగం పొందిన 28 మంది ఉపాధ్యాయులకు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. డీసీఈబీ కార్యదర్శి నీల లింగం, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

అధికార పార్టీపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట: అధికార పార్టీపై అర్థం లేని ఆరోపణలు చేయడం సరికాదని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బెస్తం చంద్రం అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు తమ పార్టీపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవకతవకలకు అవినీతికి పాల్పడిన వ్యక్తి తమ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు కమిటీలు ఏ విధంగా వేసుకుందో అప్పుడు బీఆర్‌ఎస్ నాయకులను ఎలా నియమించారో గుర్తు చేసుకోవాలన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. వార్డ్ మాజీ మెంబర్ ఇమ్రాన్ అలీ, కిసాన్ సెల్ అధ్యక్షులు ఆంద్యాల సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొలుపుల బాలరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

- బీఆర్‌ఎస్ నేతల హెచ్చరిక
- గంగమ్మ వాగు వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్


వంతెన వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రామారెడ్డి: ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న గంగమ్మ వాగు వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయకపోతే 19 గ్రామాల ప్రజలతో కలిసి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఈ మేరకు గంగమ్మ వాగు వంతెన దగ్గర ఆందోళనకు దిగారు. 19 గ్రామాల ప్రజలతోపాటు సిరికొండ, భీంగల్, మాచారెడ్డి వయా సిరిసిల్ల వైపు వెళ్లే వారు వంతెన బంద్ కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తగా ఈ మార్గంలో వచ్చేవారు సర్వీస్ రోడ్డుపై నుంచి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తు చేశారు. అధికార యంత్రాంగం కల్పించుకొని వెంటనే వాగు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు


బుడిమిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గంగారాం


పాతరాజంపేటలో .. డైరెక్టర్ రాజు



కొత్తాబాదిలో.. కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని బుడిమి సహకార సంఘం చైర్మన్ గంగుల గంగారాం అన్నారు. ఆదివారం ఆయన వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి బుడిమి, తిర్మలాపూర్, కొత్తాబాది తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపర్చి, 17 శాతంలోపు తేమ ఉండేలా ఆరబెట్టాలన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. సొసైటీ కార్యదర్శి కృష్ణమయ్య, నాయకులు గోపాల్‌రెడ్డి, జిన్న రఘు, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో డైరెక్టర్ బక్కన్నగారి రాజు ప్రారంభించారు. కౌన్సిలర్ ఆకుల రూప, మాజీ సర్పంచ్‌లు ముల్క రాజు, చందన రవి, నరేష్, రాములు, వెంకట్, గోపాల్, రాజయ్య, బాలయ్య, లక్ష్మణ్, భాస్కర్, సొసైటీ సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయాగౌడ్, షా వలీ, అబ్రార్, గోపాల్, నాని తదితరులు పాల్గొన్నారు.

పండరీపూర్ పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ/బాన్సువాడరూరల్: ఈ నెల 28 నుంచి చేపట్టే పండరీపూర్ పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వార్కారీ మహారాజ్ పండరి మాట్లాడుతూ.. మహారాష్ట్రలో ఉన్న పండరీపూర్ పుణ్యక్షేత్రానికి భక్తులు ప్రతి ఏడాది పాదయాత్రగా తరలివెళ్తారని, ఆసక్తి గల వారు పాదయాత్ర నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. నాందేడ్ మహారాజ్ శంకర్, నాయకులు నర్సింలు, గోపాల్‌రెడ్డి, ఖలేక్, పర్వారెడ్డి, మంద శ్రీనివాస్, గోపన్‌పల్లి సాయిలు, జలీల్, మన్నే చిన్న సాయిలు, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


మట్టిని తొలగిస్తున్న జేసీబీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉన్న కల్వర్టుకు ఇరు వైపులా సీసీ రోడ్లు వేయడానికి ఆదివారం పనులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు సీసీ రోడ్డు వేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. గతంలో కల్వర్టు నిర్మించగా అది బీటీ రోడ్డుకు ఎత్తుగా ఉండడంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాంతో ఇరు వైపులా సీసీ రోడ్డు వేసి బీటీ రోడ్డులో వర్షం నీరు నిలువకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

రైతు భరోసా డబ్బులు చెల్లించండి


కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


భిక్కనూరులో మంత్రి తుమ్మల దిష్టిబొమ్మ


రామారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మ దహనం


రాజంపేటలో ..


లింగంపేటలో..

సాక్షి నెట్‌వర్క్: ఈ ఖరీఫ్ సీజన్ రైతు భరోసా డబ్బులు వేయలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. రైతు భరోసా డబ్బులు ఎగ్గొట్టి రైతులను ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. రైతు భరోసా డబ్బులు ఈ సీజన్‌లో ఇవ్వడం కుదరదని చెప్పడం ప్రభుత్వ చేతకానితనమని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులపై ప్రేమ ఉంటే వెంటనే రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ చేయాలని అన్నారు.


బీబీపేటలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


బిచ్కుందలో ..


ఎల్లారెడ్డిలో..


దోమకొండలో దిష్టిబొమ్మ దహనం


గాంధారిలో ..


మాచారెడ్డిలో..


బాన్సువాడలో..


గోపాల్‌పేటలో రాస్తారోకో

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో తాడ్వాయికి చెందిన కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు ఆధ్వర్యంలో రైతు బంధు మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పైడి రాజేశ్వర్‌రెడ్డి, పీసు రాజిరెడ్డిలు చేరిన వారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సత్యసాయిసేవా సమితి భజనలు



కామారెడ్డి అర్బన్: స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీసత్యసాయిసేవా సమితిలో ఆదివారం యువజన విభాగం ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకల సందర్భంగా అల్పాహారం, అన్నదానం చేశారు. ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని భక్తులు విజయవంతం చేయాలని సేవా సమితి విజ్ఞప్తి చేసింది.

రోడ్డును బాగు చేయండి సారూ..!



పెద్దకొడప్‌గల్(జుక్కల్): వర్షాకాలం కురిసిన భారీ వానలకు పలు తండాలలో రోడ్లు కొట్టుకపోయాయి. బురుగుపల్లి నుంచి మనసారామ్ తండా వెళ్లే రహదారి వర్షాలకు రోడ్డుపై కంకర తేలిపోయి అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని తండావాసులు వేడుకుంటున్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు


మేడిపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

గాంధారి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదివారం మండలంలో పర్యటించారు. మేడిపల్లి, గౌరారం గ్రామాల్లో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మేడిపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గౌరారం గ్రామంలో బోనాల సమర్పణ వేడుకల్లో పాల్గొని బోనం ఎత్తారు. సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.